ప్రజాశక్తి
సోమవారం 2 జనవరి 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు

ప్రాణాలు తీసిన కానుకలు

- పంపిణీ సభలో తొక్కిసలాట
- ముగ్గురు మహిళలు దుర్మరణం
- మరో 13 మందికి గాయాలు
- నూతన సంవత్సరం వేళ గుంటూరులో విషాదం
- జనతా వస్త్రాలు, చంద్రన్న కానుక పంపిణీలో ఘటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు సదాశివనగర్‌లోని వికాస్ కళాశాల ప్రాంగణంలో ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ జనతా వస్త్రాలు, చంద్రన్న కానుక పంపిణీలో అపశృతి చోటుచేసుకుంది. తొక్కిసలాటలో ముగ్గురు మహిళలు ప్రాణాలు కోల్పోగా మరో 13 మంది మహిళలు గాయపడ్డారు. మృతి చెందిన వారిలో గోపిదేశి రమాదేవి (52), షేక్ మస్తాన్‌బి (42), సయ్యద్ ఆసీయా (34) ఉన్నారు. గాయపడిన వారిలో ఐదుగురికి గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో, మరో 8 మందికి వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలను అందించాలని వైద్యులను కలెక్టర్ ఆదేశించారు. దాదాపు ఐదు ▶ 2లో

ఘటనా స్థలిలో గోపిదేశి రమాదేవి మృతదేహం.. మృతురాలి ఆధార్ కార్డు (ఇన్‌సెట్)

ఓపిక నశించడం వల్లే తోపులాట : ఎస్పీ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మహిళలను ఎక్కువసేపు నిలబెట్టడం వల్లే ఓపిక నశించి తోపులాట జరిగిందని జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ ప్రకటించారు. సంక్రాంతి కానుకల పంపిణీలో తోపులాట జరిగిన ప్రదేశాన్ని ఆయన ఆదివారం రాత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సభకు తగినంత బందోబస్తు ఏర్పాటు చేశామని, నిర్వాహకులకు తగిన జాగ్రత్తలు కూడా సూచించామని అన్నారు. మహిళలను మధ్యాహ్నం 2 గంటలకు రమ్మన్నారని, సాయంత్రం 6.30 గంటలకు కానుకల పంపిణీ చేశారని చెప్పారు. మొదటి కౌంటర్‌లోనే తోపులాట జరిగిందని, ఇందులో పోలీసుల తప్పిదం లేదని చెప్పారు.

జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో మాట్లాడుతున్న పాశం రామారావు తదితరులు

క్షతగాత్రులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తొక్కిసలాటలో ముగ్గురు చనిపోవడంపై సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు మృతులకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు సంతాపం ప్రకటించారు. ఆదివారం రాత్రి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితులని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముందస్తు చర్యలు తీసుకోవడంలో ఇంటెలిజెన్స్ వైఫల్యం కనిపిస్తోందన్నారు. మరణించిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.25 లక్షలు నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. కందుకూరు ఘటన మరువక ముందే గుంటూరులో ఘటన జరగడం నిర్వహణ లోపాన్ని తెలియజేస్తోందన్నారు. ఇటువంటి కార్యక్రమాల నిర్వహణలో సంబంధిత సంస్థలు తగిన జాగ్రత్తలు తీసుకోవాని కోరారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం, పోలీసులు కూడా సహకరించాలని కోరారు. పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, నగర కార్యదర్శి కె.నళినీకాంత్ తదితరులున్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక చట్టాలు

- సిఐటియు రాష్ట్ర నాయకులు ఆర్‌వి నరసింహారావు
- రాష్ట్రమహాసభ జయప్రదం కోసం తాడేపల్లికి చేరిన జాతా

2లో

డాక్టర్ హేమలత, తపన్‌సేన్‌కు స్వాగతం పలుకుతున్న సిఐటియు నాయకులు

సిఐటియు జాతీయ నేతలకు స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం

సిఐటియు ఆలిండియా అధ్యక్షులు డాక్టర్ హేమలత, ప్రధాన కార్యదర్శి తపన్ సేన్‌కు ఆదివారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. భీమవరంలో నిర్వహించే సిఐటియు రాష్ట్ర మహాసభలో పాల్గొనేందుకు వీరు ఢిల్లీ నుంచి విమానంలో ఇక్కడకు వచ్చారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.స్వరూపరాణి, కృష్ణా జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి, కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, గన్నవరం మండల నాయకులు బి.మరియదాసు, ఐలు నాయకులు ఎ.వెంకటేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు ఎం.ఆంజనేయులు, కె.చినబాబు, ఎస్.సాంబశివరావు, ఎం.నాగేశ్వరరావు, రాజేశ్వరరావు స్వాగతం పలికారు. అక్కడి నుండి జాతీయ నాయకులు కారులో భీమవరానికి వెళ్లారు.

పథకాలపై నిరంతర నిఘా

- ఆదాయానికి గండికొట్టే చర్యలపై విస్తృత తనిఖీలు
- వైద్యసేవలు, సంక్షేమంపై దృష్టి
- ప్రజాశక్తితో విజిలెన్స్ ఎస్‌పి మాధవరెడ్డి

8లో

పిఎస్‌వికెలో ఉచిత న్యాయ సలహా కేంద్రం

ప్రారంభించిన డాక్టర్ షకీలా శ్రీధర్

ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ షకీలా శ్రీధర్, పక్కన పిన్నమనేని పాములయ్య, డి.విమల

పర్యాటకంలోకి ప్రైవేటు రంగం రావాలి : రోజా

ప్రజాశక్తి - మంగళగిరి

ఆలయ సందర్శనలో మంత్రి రోజా

పర్యాటక రంగాన్ని ప్రైవేటు రంగంలో అభివృద్ధి చేస్తే బాగుంటుందని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని ఆదివారం సందర్శించిన ఆమె మీడియాతో మాట్లాడారు. పర్యాటక రంగం అభివృద్ధిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని చెప్పారు. లంబసింగ్ మరో కాశ్మీర్ వంటిదన్నారు. భవాని ఐలాండ్‌ను అభివృద్ధి చేస్తామని, విదేశీ యాత్రికుల కోసం అమరావతిలో బుద్ధిజం అభివృద్ధికి సిఎంతో మాట్లాడతామన్నారు. మంగళగిరిలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కావాల్సిన అవసరాలేమిటో స్థానిక ఎమ్మెల్యే ద్వారా గాని, దేవస్థానం ఈవో ద్వారా గాని తెలియజేస్తే సమకూరుస్తామని చెప్పారు.

ఎమ్మెల్సీ హనుమంతరావు కు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రముఖులు

ఎమ్మెల్సీ హనుమంతురావుకు ప్రముఖుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి -మంగళగిరి

స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో నూతన సంవత్సర సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుని పలువురు నగర ప్రముఖులు, అధికారులు, వైసిపి నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేకును మురుగుడు కట్ చేశారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుంకర రఘుపతిరావు, వివిధ రంగాల ప్రముఖులు బల్లా శ్రీనివాసరావు, సుంకర చరణ్,కె. రాంబాబు, ఎస్. బాబు, దామర్ల కుబేరస్వామి, ఈ.ఆదాం, కె. ఉదయ భాస్కర్, కె. కుమార్, గోవర్ధన్ తదితరులు మురుగుడును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రావి వెంకటరమణకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాజర్

రావికు శుభాకాంక్షలు తెలిపిన నాజర్

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

నూతన సంవత్సరం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పొన్నూరు నియోజకవర్గ మాజీ సమన్వయకర్త రావి వెంకటరమణను తన నివాసంలో పొన్నూరు వైసీపీ మైనారిటీ నాయకులు షేక్ నాజర్ కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎన్. అంకినీడు చౌదరి, పొన్నూరు పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షులు మొల్లా కరీమ్ ,ఎస్సి సెల్ జిల్లా కార్యదర్శి బత్తుల కుమార్, సంధాని, కరిముల్లా పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక చట్టాలు

- సిఐటియు రాష్ట్ర నాయకులు ఆర్‌వి నరసింహారావు
- రాష్ట్ర మహాసభ జయప్రదం కోసం తాడేపల్లికి చేరిన జాతా

ప్రజాశక్తి-తాడేపల్లి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొ రేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోం దని, కార్మిక చట్టాల రద్దు, లేబర్ కోడ్‌లు తేవడం అందులో భాగమేనని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమవరంలో సోమవారం నుండి నిర్వహించే సిఐటియు రాష్ట్ర మహా సభ జయప్రదం కోసం హిందూపురం నుంచి బయల్దేరిన జాతా ఉండవల్లి సెంటర్‌కు ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు అధ్యక్షత వహించారు. నరసింహారావు మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడంలో కేంద్ర ప్రభు త్వం మునిగిపోయిందని విమర్శించారు. కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమూ బతికి బట్టకట్టలేదని హెచ్చరించారు. పని ప్రదేశాల్లో గతంలో ఏడుగురున్నా యూని యన్ పెట్టుకునే అవకాశం ఉండేదని, ప్రస్తు తం దాన్ని తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు.

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు తిప్పికొట్టాలంటే మరో స్వాతంత్ర్య పోరాటం తప్పదన్నారు. కార్మికులు అందుకు సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు నాయకులు కె.స్వరూపరాణి మాట్లాడుతూ భీమవరంలో 4వ తేదీ వరకూ నిర్వహించే మహాసభలో కార్మిక చట్టాలపై చర్చించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించ నున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఓబుల్‌రెడ్డి, లక్ష్మణరావు, కె.శ్రీనివాసరావు, ఎం.రవి, ఎ.శౌరిబర్తులు, దశరథ ామిరెడ్డి, డి.వెంకటరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, బి.గోపిరెడ్డి పాల్గొన్నారు.

మంగళగిరిలో దుప్పట్ల పంపిణీ చేస్తున్న థియేటర్ యాజమాన్యం

తెనాలిలో దుప్పట్ల పంపిణీ చేస్తున్న నాదెండ్లమనోహర్

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి సినిమా థియేటర్‌లో పనిచేస్తున్న 100 మంది కార్మికులకు నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో థియేటర్ యాజమాన్యం వీ. చంద్రశేఖర రావు, మాజీ కౌన్సిలర్ వి. ఆశా బాల, టి. వీర సత్యనారాయణ, టి జయప్రద, టి. శ్రీనివాసరావు, ఆర్.నందీశ్వర రావు, దామర్ల శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల కార్యాలయాల్లో

మంగళగిరి పట్టణంలోని టిడిపి, జనసేన పార్టీ కార్యాలయాల్లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కేకులను కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. జనసేన పార్టీ కార్యాలయం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, మునగపాటి వెంకట మారుతి రావు, షేక్ సుభాని, వాసా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, టిడిపి నాయకులు షేక్ రియాజ్, దామర్ల రాజు, గోవాడ దుర్గారావు, భోగి వినోద్, గోశాల రాఘవ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి

నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని జనసేన ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పార్టీ పిఏసిఎస్ చైర్మన్ నాదెండ్ల మనోహర్ నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం వారి సమస్యలపై జనసేన పోరాడుతోందన్నారు. నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అమ్మిశెట్టి వాసు, పి.మురళీకృష్ణ, బండారు రవికాంత్, గుంటూరు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

శరణాలయంలో కేక్ కట్ చేస్తున్న , డిజి నాయక్ ,సంధ్యారాణి

శరణాలయంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్

చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నూతన సంవత్సర కేకును షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్, శరణాలయం నిర్వాహకురాలు సంధ్యారాణి కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శరణాలయంలోని బాల బాలికలపై దాతలు చూపిస్తున్న ఆదరణ తోడ్పాటు నూతన సంవత్సరంలో కూడా ఉండాలని కోరుతూ దాతలకు శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపిడిఓ నర్గీస్‌కు శుభకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సిరి సంపదలతో సంతోషంగా ఉండాలి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక ఫిరంగిపురం మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ సలీం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ నూతన సంవత్సరం అందరూ సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 17 పంచాయతీల సర్పంచులు, 18 మంది ఎంపీటీసీలు, సిబ్బంది , అధికారులు ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

జనతా వస్త్రాలు, సంక్రాంతి కానుకను అందిస్తున్న చంద్రబాబు నాయుడు

అభివాదం చేస్తున్న చంద్రబాబు నాయుడు

ప్రాణాలు తీసిన కానుకలు

(మొదటి పేజీ తరువాయి)

గంటల పాటు మహిళలు వేచి ఉండటంతో తొక్కిసలాట జరిగిందని జిల్లా ఎస్పి అభిప్రాయపడ్డారు. గాయపడిన వారిలో రాజ్యలక్ష్మీ, తెల్లమేకల మంగమ్మ, సీతామహాలక్ష్మీ, కె.సరోజినీ ఉన్నారు.

30 వేల మందికి కానుకలు, జనతా వస్త్రాలు ఇస్తామని 10 రోజులుగా టిడిపి నాయకులు విస్తృత ప్రచారం చేశారు. అయితే ఆ మేరకు ఏర్పాట్లు చేయలేకపోయారు. అంతేగాక రెండు గంటల కల్లా సభకు రావాలని పిలుపునివ్వడంతో ఎక్కువ మంది మహిళలు ఆదివారం మధ్యాహ్నం 2 గంటల కల్లా సభ ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే పంపిణీ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభించారు. లారీలో కానుకల సంచులను ఉంచి ఒక్కొటి అందిస్తుండగా వీటిని అందుకోవడానికి ఒకేసారి ఎక్కువ మంది రావడం తొక్కిసలాటకు దారి తీసింది. అప్పటికే చీకటిపడటం, త్వరగా ఇళ్లకు వెళ్లాలని కంగారు.. ఈ రోజు ఇవ్వని వారికి తరువాత ఇస్తామని నిర్వాహకులు ప్రకటించడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది. ప్రచారానికి తగిననట్లుగా ఏర్పాట్లు చేయడంలో నిర్వాహకులు విఫలమయ్యారని బాధిత మహిళల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ప్రచార పిచ్చి పలు కుటుంబాల్లో సంక్షోభాన్ని మిగిల్చిందని వైసిపి నేతలు ఆరోపించారు.

ప్రైవేటు ఆస్పత్రికి 8 మంది తరలింపు

తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 8 మందిని గుజ్జనగుండ్ల ప్రజావైద్యశాల, డొంకరోడ్డు శ్రీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం టిడిపి నాయకుల విజ్ఞప్తి మేరకు తరలించామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

రాజకీయం చేయడం తగదు : ఆలపాటి

తొక్కిసలాట ఘటనను రాజకీయం చేయడం తగదని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ ఘటనలో చిన్నపొరపాటుకు తావులేకుండా ఏర్పాట్లు చేశామని, దురదృష్టవశాత్తు మహిళల మధ్య తొక్కిసలాట జరిగిందని, ఈ ఘటన చాలా బాధకరం అన్నారు. ముగ్గురు మృతికి ఆయన సంతాపం తెలిపారు.

మంత్రి రజనీ పరామర్శ

క్షతగాత్రులను, మృతుల కుటుంబీకులను జిజిహెచ్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్యవర ప్రసాద్, ఎమ్మెల్యే ముస్తాఫా, మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం పరామర్శించారు. ఘటన జరిగిన ప్రదేశాన్ని జిల్లా కలెక్టరు ఎం.వేణుగోపాలరెడ్డి, ఎస్పి ఆరీఫ్ హఫీజ్, ఆర్‌డిఓ ప్రభాకరరెడ్డి పరిశీలించారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది

వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-తెనాలి

పేదల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చెప్పారు. స్థానిక కొత్త పేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈ ఏడాడి నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వ ర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని, ఇందులో భాగంగానే తెనాలి పురపాలక సంఘం పరిధిలో కొత్తగా 495 సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పట్టణంలో 15,247 సామాజిక భద్రతా పింఛన్లు ఉండగా వాటికి అదనంగా 495 మందికి మంజూరు చేసినట్లు తెలిపారు. కొత్తగా మంజూరైన వాటిలో 90 మంది వికలాంగ, 216 వృద్ధాప్య, 179 వితంతు, మరో 10 వివిధ విభాగాల వారికి మంజూరైనట్లు వివరిం చారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానసీం, కమిషనర్ ఎం.జస్వంతరావు, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, వైస్ చైర్మన్ ఎం.హరిప్రసాద్, భట్రాజు కార్పొరేషన్ డైరె క్టర్ ఆర్.సుష్మరాజ్, ఎం.ప్రభాకర్, బి.దుర్గాప్రసాద్, ఎ.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

ఏడో తేదీ వరకూ పింఛను వారోత్సవాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పెంచిన పింఛన్ల పంపిణీని కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని ఉపయోగించుకొని ఆరోగ్య ఆర్థిక ప్రయోజనాలు పొందాలని లబ్ధిదారులకు సూచించారు. జిల్లాలో 2,31,220 పింఛనుదారులు ఉండగా జనవరి నుండి ఒక్కొక్కరికి రూ.2750 అందిస్తున్నట్లు చెప్పారు. పెంచిన పింఛను మొత్తాన్ని ప్రజాప్రతినిధుల ద్వారా అధికారులు జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయించాలని, ఇందుకోసం ఏడో తేదీ వరకూ పెన్షన్ వారోత్సవాలు గ్రామగ్రామాన నిర్వహించాలని అదేశించారు. ఈ సందర్భంగా అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెసి శ్యాంప్రసాద్, డిఆర్ఒ వినాయకం, డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెంచిన పింఛన్లు పంపిణీ చేస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

చిన్నారులతో మృతి చెందిన దంపతులు (ఫైల్ ఫోటో)

తాతయ్య వద్దకు మృతుల బిడ్డలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ఇటీవల అమెరి కాలో సరస్సులో పడి మృతి చెందిన ముద్దన నారాయణ, హరిత దంపతుల కుమా ర్తెలు హర్షిత, పూజితలను మృతుడు నారాయణ స్నేహితుల బృందం అమెరికా తీసుకొచ్చింది. నారాయణ సొంతూరైన మండలంలోని పాల పర్రుకు వారిని ఆదివారం చేర్చారు. తాతయ్య ముద్దన సుబ్బారావుకు పిల్లల్ని అప్ప గించారు. మృతి చెందిన నారాయణ, హరిత మృతదేహాలు బుధవారం నాటికి పాల పర్రు చేరుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు.

వికలాంగులకు 78 వీల్‌ఛైర్లు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న, నడవలేని స్థితిలో ఉన్న వికలాంగులకు, ప్రభుత్వ వైద్య శాలలకు అందజేసేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా శాఖ, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 78 వీల్ చైర్స్‌ను పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ శివశంకర్ చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వికలాంగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం మొదటి రోజున రెడ్‌క్రాస్, రోటరీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం, వాటిని తన ద్వారా అందించడం సంతోషంగా ఉందని చెప్పారు. సేవా కార్యక్రమా లలో రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ ఎప్పటికీ ముందుండాన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ ద్వారా మరిన్ని సేవలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, రెడ్‌క్రాస్ గుంటూరు జిల్లా వైస్ చైర్మన్ రామచంద్రరాజు, రోటరీ 3150 గవర్నర్ రాజశేఖర్‌రెడ్డి, డిసిహెచ్ఎస్ రంగారావు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి శోభారాణి, ఎన్‌సిడి ఆఫీసర్ హనుమకుమార్, బి.మురళి, కెఎంఎన్‌వి శ్రీనివాసగుప్త, డాక్టర్ సృజనా, బివిఎల్ ప్రసాద్, ఆంజనేయులు, మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీల్‌చైర్లను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కె.జగన్మోహన్‌రెడ్డి

మద్యం మత్తులో బ్లేడుతో దాడి

ప్రజాశక్తి - దుగ్గిరాల

మద్యం మత్తులో తూలనాడ్డంతోపాటు బ్లేడుతో దాడికి పాల్పడిన ఘటన మండలంలోని చిలులూరులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. క్షతగాత్రుల కథనం ప్రకారం.. చివులూరు గ్రామ సమీపంలో ఒ ప్రభుత్వ మద్య దుకాణం ఉంది. దాని వద్ద రాత్రి 10 గంటలప్పుడు కొంతమంది మద్యం తాగుతున్నారు. షేక్ మొహిద్దీన్ కూడా తన ద్విచక్ర వాహనంపై అక్కడికొచ్చాడు. ఆ వాహనంపై టిడిపి చిహ్నం ఉండడంతో ఆ ప్రాంతంలోనే ఉన్న వైసికికి చెందిన వ్యక్తి దాన్ని చూసి 'ఎవర్రా ఇక్కడ తెలుగుదేశం పార్టీ వాడు' అని దురుసుగా మాట్లాడాడు. మొహిద్దీన్ కలుగజేసుకోవడంతో మాటామాటా పెరిగింది. వెంటనే ఎదుటి వ్యక్తి బ్లేడుతో మొహిద్దీన్‌పై దాడి చేశాడు. కడుపు మీద గాయాలయ్యాయి. దీంతో దాడి చేసిన వ్యక్తి అక్కడి నుండి పరారయ్యాడు. అయితే దీనిపై కేసేమీ నమోదు కాలేదు.

ఉచిత వైద్యసేవలందిస్తున్న వైద్యులకు సన్మానం

డాక్టర్ శాఖమూరి బాజిబాబును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఉచిత వైద్య శిబిరాలలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులను ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ కమిటి సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. రొంపిచర్ల మండలం సంతగుడిపాడులో కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రతినెల మొదటి ఆదివారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగానూ, నూతన సంవత్సరం సందర్భంగానూ ఆయా వైద్య బృందానికి సన్మానం చేసినట్లు తెలిపారు. ఇటీవల కాలం వరకు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఇకనుండి గ్రామంలోని డాక్టర్ కోసూరు సుబ్బారావు ఇంటి వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కడియాల హాస్పిటల్ డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, వివేకానంద హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శాఖమూరి బాజీబాబు ,శేషాద్రి హాస్పిటల్ డాక్టర్ గోనుగుంట్ల రామకిషన్, ఏషియన్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వంశీ నాథ్ రెడ్డి, అనన్య హాస్పిటల్ డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ, సాయి నిహారిక హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బొల్లు సాయిరాం, ఎంవి రెడ్డి నేత్ర వైద్యశాల డాక్టర్ ముద్దం వివేకానంద రెడ్డి, ఆర్ఆర్ డెంటల్ , కోసూరు కిడ్నీ కేర్ హాస్పిటల్స్ వైద్యులకు సన్మానం చేసినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. తమ గ్రామంలో ప్రతి నెల మొదటి ఆదివారం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతాయని వైద్య బృందం సహకరించాలని పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు.

169 నూతన పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని 11 గ్రామాలలో నూతనంగా మంజూరైన 169 పెన్షన్లనుప్రజా ప్రతినిధులు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో గౌసియా బేగం తెలిపారు. ఈ నెల నుంచి రూ.2,750 ఇవ్వనున్నట్లు చెప్పారు. వీటితో కలుపు కొని మొత్తం పింఛన్లు సంఖ్య 6,781 చేరిందన్నారు

శ్రీఅమరేశ్వరాలయం కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అమరావతి

పంచారామాలల్లో ప్రసిద్ధి చెందిన అమరావతిలోని శ్రీబాల చాముండిక సమేత శ్రీఅమరేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన నూతన క్యాలెండర్ ను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆవి ష్కరించారు. నూతన సంవత్సరం ను పురస్కరించుకొని ఆలయ పండితులు, అధికారులు ఎమ్మెల్యే శంకరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేద పండితులు నంబూరు శంకర్రావు దంపతులను వేదమంత్రాలతో ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ అమరేశ్వర స్వామి దయతో నూతన సంవత్సరం ప్రజలందరికీ శుభాలు కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో సునీల్ కుమార్,వైసీపీ నాయకులు కొండవీటి కోటేశ్వర రావు,పులిపాటి పవన్ కుమార్,ఆలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంతల రోడ్డు బాగుపడేదెప్పుడు?

ప్రజాశక్తి - ముప్పాళ్ల

మండలంలోని తురకపాలెంకు వెళ్ళే ఆర్ అండ్ బి రోడ్డు అధ్వానంగా తయారైంది. గుంతలమయంగా మారింది. ఈ దారిలో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. ఈ దారి ముప్పాళ్ల గ్రామ పంచాయతి పరిధిలోని కొంకావారిపాలెం కాలనీకి , తురకపాలెం గ్రామ పంచాయతి ద్వారా దమ్మాలపాడు మీదుగా ధూళిపాళ్ల నుంచి సత్తెనపల్లికి, ఇదే గ్రామం నుంచి నకరికల్లు వెళ్ళే మార్గాలను కలుపుతుంది. ఈ రోడ్డు నుంచి వాహనాలు రాకపోకలు ఎక్కువే. ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడిన సందర్భాలు అనేకం. రోడ్డు ఎప్పుడు వేస్తారో గానీ, కనీసం గుంతలైనా పూడ్చాలంటూ ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డు వేసి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులను సంప్రదించినా ఫలితం లేదు

రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని తురకపాలెం సర్పంచ్ మల్లవరపు చంద్రశేఖర్ అన్నారు. ఈ రోడ్డు ప్రధాన రహదారులను కూడా కలుపుతుంది. రోడ్డు మరమ్మతుల విషయమై ఆర్ అండ్ బి అధికారులను పలుమార్లు సంప్రదించినా ఫలితం లేకుండా పోయింది. రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో రాత్రి సమయాల్లో ద్విచక్రవాహనాలపై వచ్చే వారు ప్రమాదాల బారిన పడాల్సి వస్తోంది.

సీనియర్ ఆర్టిస్ట్ బి. ప్రసాద్ రావు చిత్రించిన 'కష్టజీవి కర్షకుడు'

రైతు బాగుంటే సుభిక్షంగా ఉంటాం

ప్రజాశక్తి-వినుకొండ

నూతన సంవత్సరం-2023ను స్వాగతిస్తూ పట్టణానికి చెందిన సీనియర్ ఆర్టిస్టు బి. ప్రసాద్ రావు, 'కష్టజీవి కర్షకుడు' రైతు బొమ్మను చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రకృతి సహకరించి అన్ని విధాల రైతులకు కలిసి రావాలని అన్నారు. రైతే వెన్నెముక అని, రైతు బాగుంటే దేశం కళకళలాడుతూ ఉంటుందన్నారు. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకు రైతును తలచుకోవటం ప్రతిఒక్కరి విధి అని అన్నారు. రైతు బాగుంటే సుభిక్షంగా ఉంటామన్నారు. ఈ ఏడాది రైతులకు బాగుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తూ సంక్రాంతి పండుగకు కూడా స్వాగతం పలకడం జరిగిందన్నారు. ప్రతి పండుగకు దాని విశిష్టతను తెలియజేస్తూ బొమ్మలు వేయుడం తన అలవాటని చెప్పారు. ఈక్రమంలోనే రైతు నాగలితో ఉన్న 'కష్టజీవి కర్షకుడు' బొమ్మను చిత్రీకరించానని వివరించారు.

సాగని వ్యాపారం.. ఉపాధి భారం..

- **వస్త్ర, రెడీమేడ్ దుస్తుల వ్యాపారులు కుదేలు**
- **రూ.40 లక్షల నుంచి రూ.ఐదారు లక్షలకు విక్రయాలు**
- **మూతబడుతున్న దుకాణాలు**
- **ఉపాధి కోల్పయి రోడ్డున పడుతున్న వర్కర్లు**

ప్రజాశక్తి - చిలకలూరిపేట

'నిత్య కళ్యాణం పచ్చతోరణం' అన్నట్టుగా ఉండే వస్త్ర, రెడీమేడ్ వ్యాపారస్తుల పరిస్థితి దయనీయంగా మారింది.ఆ దుకాణాల్లో పనిచేసే వారు ఉపాధి కోల్పోయి ఇంటికే పరిమితమవుతున్నారు. నిత్యం సుమారు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల అమ్మకాలతో, చిన్నాచితకా వ్యాపారం చేసుకునే వస్త్ర వ్యాపార దుకాణాలు పట్టణంలో సుమారు150 నుంచి180 వరకూ ఉంటాయి. ఆయా దుకాణాల ద్వారా పదిహేను వందల నుంచి పద్దె నిమిది వందల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. వందల మందికి జీవనోపాధి కలిగిస్తున్న ఈ వ్యాపారం కుదేలైంది. విద్యుత్ బిల్లులు,అద్దెలు కట్టలేని పరిస్థితే కాదు తమ వద్ద పనిచేసే వారికి జీతాలూ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. 180 దుకాణాల సంఖ్య 30 నుంచి 40కు చేరింది. కొవిడ్ అనంతరం వస్త్ర వ్యాపారులది కోలుకోలేని పరిస్థితి. పండుగ రోజుల్లో, ప్రత్యేకమైన రోజుల్లో కూడా వ్యాపారం జోరుగా సాగడం లేదు.

ఒకప్పుడు మూడు,నాలుగు షాపుల వారు మాత్రమే స్థానికంగా, చుట్టూ ప్రక్కల గ్రామాలకు సరఫరా చేసే వారు. మిగిలినవి రిటైల్‌గా అమ్మకాలు సాగించేవారు. ప్రస్తుతం నాలుగైదు రిటైల్ షాపులలో మాత్రమే కొద్దోగొప్పో వ్యాపారం సాగుతోంది. హోల్‌సేల్ వ్యాపారం విషయానికొస్తే, కరోనా పరిస్థితుల ప్రభావం, పన్నుల భారంతో వ్యాపారాలు తగ్గిపోయాయి. ఆన్‌లైన్ వ్యాపారం చేసే వారి సంఖ్య పెరి గిందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

గతంలో హోల్ సేల్, రిటైల్ షాపులన్నీ కలిపి రోజుకు రూ.40 నుంచి రూ.50 లక్షల వరకు అమ్మకాలు జరిపేవి. ప్రసుతం ఆ అమ్మకాలు రూ. 4 నుంచి రూ.5 లక్షలు కూడా లేవని అంటున్నారు. మొదట్లో ప్రతి షాపులో ఆరేడు గురు పని వారు ఉండే వారని షాపుల యజమానులు అంటున్నారు. వారి అనుభవం మేరకు వారికి జీతాలు ఇచ్చే వారమని చెప్పారు. ప్రారంభంలో పని వారికి సుమారు రూ. 6 వేల నుంచి రూ.7 వేల వరకు ఇస్తున్నారు. అదే విధంగా పట్టణం మొత్తంలో వస్త్ర దుకాణాల్లో పనిచేసే వారి సంఖ్య పదిహేను వందల నుంచి పద్దెనిమిది వందల వరకు ఉండేది. ప్రస్తుతం నూట యాభై నుంచి మూడు వందల మంది పనివారు మాత్రమే బట్టల షాపులలో పని చేస్తున్నారు. ఆన్‌లైన్ వ్యాపారం ప్రభావం వస్త్ర, రెడిమేడ్ దుస్తుల దుకాణాలపై తీవ్రంగా పడిందని,ప్రత్యేకంగా బట్టల దుకాణానికి రావాల్సిన అవసరం లేకుండా పోయిందని, షాపుల అద్దెలు, కరెంటు బిల్లులు, వర్కర్ల జీతాలకు సరిపడా డబ్బులు కూడా రావడం లేదని, వ్యాపారం చేయలేకపోతున్నామని వ్యాపారస్తులు వాపోతున్నారు. బట్టల వ్యాపారంపై ప్రస్తుతం విధించిన జిఎస్‌టి, లోకల్ పన్నులు,విద్యుత్ తదితర ఛార్జిలను తీసి వేయడమే కాక ప్రత్యేక రుణ సదుపాయాలను కల్పించి తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేస్తు న్నారు.

ఇంటి వద్దే ఉంటున్నా..

పి.జ్యోతి మాటల్లో ..నేను ఒక ప్రముఖ బట్టల షాపులో నాలుగేళ్ల పని చేశాను. మొదట్లో ఆరు వేల రూపాయలు ఇచ్చేవారు. నా సంపాదనతో మా కుటుం బానికి చేదోడుగా ఉంటున్నాను. ప్రస్తుతం ఆ షాపు మూసివేయడంతో ఇంటి వద్దే ఉంటున్నాను. వేరే షాపులోకి వెళ్లి పని చేద్దామని వెళితే 'పరిస్థితులు బాగో లేదు.. మేమే కబురు పెడతాం' అని చెబుతున్నారంటూ వాపోయింది.

తీసేస్తారేమోనని హడలిపోతున్నా

పి.ప్రసన్న మాట్లాడుతూ ఓ ప్రముఖ షాపులో సుమారు పన్నెండేళ్ల నుంచి పని చేస్తున్నాను. కొనుగోలు,కలెక్షన్ వసూళ్లకు కూడా వెళుంటాను. అయితే, ప్రస్తుతం వ్యాపారం లేక ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. పరిస్థితులు అనుకూలంగా లేవని, ఎవరిని, ఎప్పుడు పనిలో నుంచి తీసేస్తారోనని హడలిపోతున్నట్లు చెప్పారు.

వడ్డీలు కట్టలేకపోతున్నాం

ప్రస్తుతం తనకు రెండు వస్త్ర దుకాణాలు, ఒక రెడీమేడ్ షాపు ఉందని ఒక వ్యాపారస్తుడు చెప్పారు. ఈ మూడు షాపుల్లో వ్యాపారం సాగడం లేదని, అన్ని నష్టాల్లో ఉన్నట్లు చెప్పారు. ఈ మూడు షాపులను ఒకటిగా చేశామని, రెండు షాపుల్లో పనిచేసేవారిలో కొంత మందిని తొలగించి, తమ కుటుంబ సభ్యులు కూడా ఆ దుకాణంలో ఉంటున్నారని అన్నారు. వడ్డీలు కట్టలేని పరిస్థితి అని, దీనికి తోడు పన్నులు , బిల్లులు భారంగా మారాయని చెప్పారు.

నూతనోత్సాహంతో ముందుకు సాగాలి: మాజీ ఎమ్మెల్యే వైవి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని, అందులో సత్తెనపల్లి నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి గెలుపు తథ్యమని మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు ధీమా వ్యక్తం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో టిడిపి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆయన కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయులు మాట్లాడుతూ కొత్త ఏడాదిలో నూతనోత్సాహంతో ముందుకు సాగాలని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిడిపి విజయానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. చంద్రబాబు, లోకేష్‌లపై వైసిపి నాయకులు వారి ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అక్రమాలు, దోపిడీలు, దౌర్జన్యాలు రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిడిపిని గెలిపించుకొనేందుకు ప్రజలు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ఎన్ని కుతంత్రాలు పన్నినా టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేరని, చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసే వరకు అహర్నిశలు శ్రమించాలని పార్టీ కార్యకర్తలు,నాయకులు, అభిమానులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఎ.సాంబయ్య , సంఘం డైరీ డైరెక్టర్ పి. నాగరాజ శేషు కుమారి, మండల టిడిపి అధ్యక్షులు కె.రామకృష్ణ, ఎ.అమరేశ్వరరావు, బి.నాగే శ్వరరావు, పి.పెద్దిరాజు, కౌన్సిలర్లు మేరీ గ్రేస్, జానీ బాషా,కె.అబ్రహం, ఎంపిపి పి.నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు

చంద్రబాబును కలిసిన వైవి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకు సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో చంద్ర బాబును ఆయన ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. చంద్రబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సత్కరించారు. టిడిపి వినూత్న కార్యక్రమాలతో ప్రజలను చైతన్య పరుస్తూ, పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహంతో ముందుకు సాగుతున్నామని, పార్టీ బలోపేతానికి కృషి చేసామని చంద్రబాబుకు ఆంజనేయులు వివరించారు.

చంద్రబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న వైవి

ప్రజలకు మేలు జరగాలి: ప్రత్తిపాటి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు స్థానిక పండరీపురంలోని ఆయన నివాసం వద్ద జిల్లా, నియోజకవర్గ ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సరం శుభాకాంక్షలు ఆదివారం తెలిపారు. పార్టీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేశారు. అనంతరం పట్టణ, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. పుల్లారావు మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ప్రజలకు అంతా మేలు జరగాలని, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా అభివృద్ధి చెందాలన్న ఆశా భావం వ్యక్తం చేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. అధికారులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

జెడ్పి కార్యాలయంలో..

జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జెడ్పి ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, జెడ్పి సిఇఒ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ సిఇఒ సుజాత తదితరులు పాల్గొన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ క్రిస్టినా న్యూ ఇయర్ కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. నాల్గవ తరగతి ఉద్యోగులకు నూతన వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటిసిలు, ఎంపిపిలు తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

నూతన సంవత్సరం సందర్భంగా ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా నాయకులు ఆదివారం జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డిని, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారిని, ఇరిగేషన్ ఎస్ఈ ఉమామమేశ్వరరావుని, జిల్లా రిజిస్ట్రార్ శైలజను, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ సుమయాఖాన్, డిఇఒ శైలజను, వివిధ శాఖల జిల్లా అధికారుల్ని కలిసి పూలబొకేలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, ఎస్.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న హెనీక్రిస్టినా

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా నాయకులు

జిల్లా ట్రెజరీ డిడికి శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రెజరీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు

ట్రెజరీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

ట్రెజరీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు జిల్లా ట్రెజరీ డిడి ని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలను మొదటి ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తామని, జనవరి, ఫిబ్రవరి నెలల్లో జీవన ధృవీకరణ పత్రాలను సమర్పించటానికి కావాల్సిన సదుపాయాలను కల్పిస్తామని డిడి అన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు నాగరాజు, జిల్లా నాయకులు ఎ.సుబ్బారావు, నాగేశ్వరరావు, సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు పలువురు శుభాకాంక్షలు..

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావును పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరు ఎంఇఒ ఖుద్దూస్, ఉర్దూ డిఐ ఎండి ఖాసిం, ఆడిట్ ఆఫీసర్ షరీఫ్, యుటిఎఫ్, ఎపిటిఎఫ్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి మేరుగ నాగార్జునకు శుభాకాంక్షలు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి సుబ్బారావు, ఎంఇఒలు ఖుద్దూస్, ప్రభుత్వ పాఠ్యపుస్తకాల జిల్లా మేనేజర్ వి.వజ్రబాబు, ఉర్దూ డిఐ ఖాసిం తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మంత్రి మేరుగ నాగార్జునకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్‌జెడి సుబ్బారావు

బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కల్చరల్ నైట్

ప్రజాశక్తి -మంగళగిరి

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ మంగళగిరి కమిటీల ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా టిప్పర్ల బజార్లో కల్చరల్ నైట్ కార్యక్రమం నిర్వహించారు. డాన్స్, పాటలు, పద్యాలు, డైలాగ్స్, మిమిక్రీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులలో దాగివున్న నైపుణ్యాలను వెలిగి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ, ఎస్ఎఫ్ఐ నాయకులు పఠాన్ మున్నా, మహమ్మద్ అష్రఫ్, డివైఎఫ్ఐ నాయకులు ఎస్.గణేష్ పాల్గొన్నారు. అనంతరం బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు జెవి రాఘవులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న జ్యోతి బసు

చంద్రబాబును కలిసిన నాయకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడిని ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర టిడిపి ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు డి.జ్యోతిబస్ కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మంగళగిరి నియోజకవర్గ పరిస్థితిపై ఆరా తీశారు. చంద్రబాబును కలిసిన వారిలో టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్ధయ్య ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ తెనాలి నూతన అధ్యక్ష కార్యదర్శులుగా వినయ్‌తుల్లా, ఉదయ్ ఈశ్వర్ ఎన్నిక

వినయ్ తుల్లా ,ఉదయ్ ఈశ్వర్

ప్రజాశక్తి - తెనాలి: ఎస్ఎఫ్ఐ తెనాలి నూతన అధ్యక్ష కార్యదర్శులుగా వినయ్ తుల్లా ఎస్ ఉదయ్ ఈశ్వర్‌లు ఎన్నికయ్యారు ఉపాధ్యక్షులుగా భువన్ సుభాష్, సహాయ కార్యదర్శులుగా అభిరామ్ యశ్వంత్, 20 మంది విద్యార్థులు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో కృషి చేస్తామని నూతన జాతీయ విద్యా విధానం 2020కి వ్యతిరేకంగా విద్యార్థులను ఐక్యం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా ఉద్యమంలో నిర్వహిస్తామని తెలిపారు.

శరీరదారుఢ్యానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆటలపోటీలు ప్రారంభిస్తున్న కరుణాకరరావు

శరీర ధారుఢ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని ప్రజానాట్యమండలి పట్టణ కార్యదర్శి కొట్టె కరుణాకరరావు చెప్పారు. పట్టణంలోని సీతానగరం బోటు యార్డు వద్ద నూతన సంవత్సరం సందర్భంగా పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను జెండా ఊపి కరుణాకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు పిల్లలకు ఆటలు కూడా ముఖ్యమని చెప్పారు. బాలబాలికల్లో నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఆటలు దోహదపడతాయన్నారు. అనంతరం ఆటల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రజా సంఘాల నాయకుల కట్టా మేరి, వి.సామ్యేల్, లావణ్య, మాధవి పాల్గొన్నారు.

పనులు కోసం కార్మికుల వలసబాట

- దారి మళ్లిన కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు
- సంక్షోభంలో భవన నిర్మాణ రంగ కార్మికులు
- తుళ్లూరు, మంగళగిరిలో కార్మికులతో సిఐటియు విస్తృత సమావేశాలు

ప్రజాశక్తి - తుళ్లూరు

వైసిపి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో భవన నిర్మాణ రంగం కుదేలైందని, పనులు కోసం భవన నిర్మాణ కార్మికులు వలసపోతున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి డి లక్ష్మీనారాయణ అన్నారు. తుళ్లూరు ఏరియా భవన నిర్మాణ కార్మిక విస్తృత స్థాయి సమావేశం ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో పిచ్చియ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ,రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక భవన నిర్మాణ కార్మికుల సమస్యలు మరింతగా పెరిగిపోయాయని అన్నారు.గతంలో ఇసుక తక్కువ ధరకు లభ్యం కావడం వల్ల నిర్మాణ పనులు అధికంగా ఉండేవని, ప్రభుత్వం ఇసుకను ప్రైవేటు వారికి అప్పజెప్పడంతో ఇసుక ధరలు పెరిగి నిర్మాణాలు లేక కార్మికులకు పనులు లేకుండా పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.కార్మిక సంక్షేమ బోర్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్ళించడం వల్ల సంక్షేమ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు అందడం లేదని చెప్పారు. భవన నిర్మాణ కార్మికులు కష్టపడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయటం కోసం కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని,సంక్షేమ బోర్డును కాపాడుకోవడం కోసం భవన నిర్మాణ కార్మికులు పెద్దఎత్తున ఆందోళన చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తుళ్లూరు ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం. భాగ్యరాజు మాట్లాడుతూ,భవన నిర్మాణ కార్మికులు గతంలో ఎన్నడూ లేని విధంగా పనులు కోల్పోయారని,గత రెండేళ్ళలో ఇసుక లేక,కరోనా దాటికి అప్పుల పాలై కొంతమంది కార్మికులు ఆత్మహత్యలు చేర్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకున్న కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక,సిమెంటుతో పాటు నిర్మాణ రంగ మెటీరియల్ ధరలను రాష్ట్ర ప్రభుత్వం పెంచుకుంటూ పోవడంతో భవన నిర్మాణ కార్మికులు వలసలు పోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని అన్నారు. సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ గతంలో ఇతర రాష్ట్రాల నుండి రాజధాని ప్రాంతానికి భవన నిర్మాణ కార్మికులు వచ్చేవారని ప్రస్తుతం ఇక్కడి కార్మికులు పనులు కోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని చెప్పారు. పనులు లేక కొద్దిపాటి జీతాలతో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారని అన్నారు. చెంచయ్య,కోటి,బాబు, రాజేష్ పాల్గొన్నారు.

తుళ్లూరు సమావేశంలో మాట్లాడుతున్న డి.లక్ష్మీనారాయణ

మంగళగిరిలో సమావేశంలో మాట్లాడుతున్న జెవి రాఘవులు

ప్రజాశక్తి- మంగళగిరి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వలన భవన నిర్మాణ రంగ కార్మికులు సంక్షోభంలో ఉన్నారని సిఐటియు నాయకులు జేవీ రాఘవులు అన్నారు. ఆదివారం మంగళగిరి సిఐటియు కార్యాలయంలో ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘం నాయకులు టి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. రాఘవులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉక్కు కర్మాగారాలను ప్రైవేటు రంగానికి అప్పగించడం వలన ఐరన్ రేట్లు విపరీతంగా పెరిగి నిర్మాణరంగం కుదేలైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ధరలను విపరీతంగా పెంచడం వలన భవన నిర్మాణ రంగ కార్మికులకు పనులు లేక గత మూడేళ్ల నుండి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నూతన సంవత్సరంలోనైనా భవన నిర్మాణ రంగ కార్మికులు సంఘటితంగా ఉండి తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి షేక్ జానీ భాష, నాయకులు శ్రీనివాసరావు, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

పిఎస్‌వికెలో ఉచిత న్యాయ సలహా కేంద్రం

సత్తెనపల్లిలో ప్రారంభించిన డాక్టర్ షకీలా శ్రీధర్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

వైవాహిక జీవితం పట్ల సరైన అవగాహన లేకపోవడంతోనే భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు, సమస్యలు తలెత్తుతున్నాయని, అర్థం చేసుకోవడం, సర్దుకుపోవడం కాకుండా పంతాలు, పట్టింపులకు పోయి కేసులు, కోర్టు దాకా వెళుతున్నారని వంశీ స్పెషాలిటీస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ షకీలా శ్రీధర్ అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్‌వికె) ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు పిఎస్‌వికె కన్వీనర్ పి.సూర్యప్రకాశరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ షకీలా శ్రీధర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బాధ్యతను తీర్చుకునేందుకు ఆడపిల్లలకు చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం, అప్పటికి ఆ పిల్లలకు వివాహంపై అవగాహన లేకపోవడంతో సమస్యలు వస్తున్నాయని చెప్పారు. సమస్యలను చక్కదిద్దాల్సిన తల్లిదండ్రులు వారివారి పిల్లలను చెరో వైపు లాగడంతో సమస్యలు మరింత జటిలమవుతున్నాయని అన్నారు. కేసులు కోర్టులు, చట్టాలు శిక్షలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో వారికి సరైన అవగాహన కల్పించేందుకు ఇలాంటి ఉచిత న్యాయ సలహా కేంద్రాలను చాలా అవసరమని చెప్పారు. ఉచిత న్యాయ సలహాదారు, ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య మాట్లాడుతూ ఏదైనా అంశంలో దావా వేసి కోర్టుల చుట్టూ తిరిగి డబ్బులు ఖర్చు పెట్టుకొని కేసు గెలవడం ఒక్కటే విజయం కాదనీ, ఓడిపోవడంతో జీవితంలో ఏదో కోల్పోయామని చతికిలపడటం సరైనది కాదని అన్నారు. ఒక్కో సందర్భంలో పంతాలకు పట్టుదలకు పోయి కేసులు, కోర్టులకు దాకా వెళ్లి ఏళ్ల తరబడి చివరిదాకా దావాలు నడిపించి విసిగి వేసారేకంటే రాజీ మార్గంలో సమస్యను పరిష్కరించుకోవడమూ విజయమేనని వివరించారు. వేగంగా మారుతున్న పరిస్థితులు, చదువులు, ఉద్యోగాలలో వచ్చిన విచ్చలవిడి స్వేచ్ఛ, వినిమయతత్వంతో విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని, ఈ విషయాలను గమనించుకోలేక సమస్యల్లో పడుతున్నారని అన్నారు. భార్యాభర్తల మధ్య సమస్యలు

మాట్లాడుతున్న డాక్టర్ షకీలా శ్రీధర్

వచ్చినప్పుడు చట్టాలు, కేసుల పట్ల అవగాహన లేక నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విలువైన జీవితాలను కోల్పోతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బాధితులకు ఉచిత న్యాయ సలహా కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

అనంతరం జన విజ్ఞాన వేదిక కమిటీ సభ్యులు గద్దె చల మయ్య, సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమశ్రీ మాట్లాడుతూ దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చల పల్లి సుందరయ్య జీవితంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారని, సమాజంలో అనేక రుగ్మతులను రూపు మాపారని అన్నారు. అటువంటి ఆదర్శ మూర్తి ఆశయాలు ఆదర్శంగా పిఎస్‌వికె ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారంపై అవగాహన, సేవా కార్యక్రమాల నిర్వహణ వంటివి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే ఈ ఉచిత న్యాయ సలహా కేంద్రమని, ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు డి.విమల, జి.మల్లేశ్వరి, కె.శివదుర్గారావు, ఎ.వీర బ్రహ్మం, జి.రజిని, ఎం.జ్యోతి, పిఎస్‌వికె కమిటీ సభ్యులు టి.వెంకటేశ్వర్లు, కె.హనుమంతరావు, కె.మాధవి, కె.జగన్ పాల్గొన్నారు.

అమరావతిలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో కోట్లాది కుటుంబాలకు సీఎం జగన్ మోహన్ రెడ్డి పెద్ద కొడుకులా మారారని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు అన్నారు.మండల కేంద్రమైన అమరావతిలోని శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్ లో పెంచిన పెన్షన్లు,306నూతన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ పేద కుటుంబాలకు పెద్దదిక్కుగా మారిన సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రతి నెల పెన్షన్ల రూపంలో ఆర్థికంగా అండగా నిలుస్తున్నారన్నారు. గత పాలకులు నామమాత్రంగా పెన్షన్ పంపిణీ చేస్తే తమ ప్రభుత్వం ఛిత్తశుద్ధితో అర్హులందరికీ పెన్షన్లు అందజేస్తోందన్నారు. అర్హత ఉండి తమకు పెన్షన్ రావడం లేదని టీడీపీ నేతలు ఎవరైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. ప్రజాసంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తూ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. తమ ప్రభుత్వానికి ప్రజాశీర్వాదం కావాలని కోరారు. ఎమ్మెల్యే, అమరావతిఎంపీడీవో పి మాధురి,ఎమ్మార్వో విజయశ్రీ, అధికారులు, గ్రామంలో వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లతో కలిసి వార్డులలో ఇంటింటికి వెళ్లి పెంచిన పెన్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, వైసిపి నాయకులు నిమ్మా విజయ సాగర్ బాబు,వెంపా జ్వాలయ్య, కోటా హరిబాబు, షేక్ హష్మి, ఈడుపుగంటి కరుణకుమారి, మంగిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు బియ్యం

ప్రజాశక్తి - మాచర్ల

రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా స్థానిక శ్రీశైలం రోడ్ లోని లెప్రసీ కాలనీ లోని 30 మంది పేదలకు బియ్యం, కందిపప్పు పంపిణీ చేశారు. పట్టణ ప్రముఖ వైద్యులు సీనియర్ రోటరియన్ డాక్టర్ రామకోటయ్య ఆర్థిక సహాయంతో పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగూర్‌వలి తెలిపారు. సత్యప్రసాద్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగర మాత ఆలయంలో వేడుకలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

సాగర్ మాత ఆలయంలో నూతన సంవత్సర వేడుకలు విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాల సాగర్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ భక్తులను ఉద్దేశించి సందేశ మిచ్చారు. ముందుగా ఆలయంలో నూతన సంవత్సర కేకు ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు, దివ్యబలి పూజ కార్యక్రమాన్ని చిన్న ఫాదర్ తంబి, ఆలయ కమిటీ సభ్యులు డి.ఇన్నా రెడ్డి, ఎన్.మరియదాసు, ఎం.జోషి, కె.రాజు, బి.శౌరిరాజు, కె.రాజు, బి.చందు, జి.నాగరాజు, విజయ్ భక్తులు పాల్గొన్నారు.

నర్సరావుపేటలో అభిమానుల సమక్షంలో కేకు కట్ చేస్తున్న ఎంపి

రెంటచింతలలో కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి

ఎమ్మెల్యే శ్రీనివాస రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి నాయకులు

పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు నివాసంలో..

వినుకొండ మున్సిపల్ ఆఫీసులో పారిశుద్ధ్య కార్మికుల ఆధ్వర్యంలో..

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-నరసరావుపేట

పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలోని ఎంపి లావు శ్రీకష్ణదేవరాయలు కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. పల్నాడులోని ఏడు నియోజక వర్గాల నుండి అభిమానులు, కార్యకర్తలు, నేతలు హాజరై ఎంపికు శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిమానులు, నేతలు పాల్గొని కేక్ లు కట్ చేస్తూ ఎంపి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాశక్తి-రెంటచింతల

కాలం.. చల్లని నీడనిచ్చే చెట్టువంటిదని, కొత్త ఏడాదిలో అందరి కుటుంబాల్లో శాంతి వెల్లివిరియాలని మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోర్తుల ఉమా మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పి.సీతారామరెడ్డి, జి. భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ విప్ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కార్యాలయం అధికారులు, ఆయన అభిమానులతో కిటకిటలాడింది. ఎమ్మెల్యేకు మున్సిపల్ చైర్మన్ రఘురామిరెడ్డి, ఎంపిపి బూడిద శ్రీనివాస్ రావు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి-వినుకొండ

కారంపూడి రోడ్ లోని కళ్యాణ మండపంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు అధికారులు, ఉద్యోగులు, కార్యకర్తల అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, వైసిపి నియోజకవర్గ నాయకులు ఎం.మల్లికార్జునరావు స్థానిక కొత్తపేట నివాసం వద్ద ప్రజలకు అందుబాటులో ఉన్నారు. నియోజకవర్గం లోని ఐదు మండలాల నుండి తరలివచ్చిన కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సరం వేడుకలను పట్టణంలో ప్రజలు ఘనంగా జరుపు కున్నారు. పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తన నివాసంలో ప్రజలకు అందుబాటులో ఉన్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాల నుండి తరలివచ్చిన అభిమానులు, పార్టీ కార్యకర్తలు నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. యుటిఎఫ్ తో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాలు ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి-నరసరావుపేట

స్థానిక ప్రకాష్ నగర్ లోని వైసిపి కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఎమ్మెల్యేకు వైసిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. 2023 సంవత్సరంలో నరసరావుపేట నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి కృషి చేస్తానన్నారు. ఒకటో తేదీ నుంచి పింఛన్లు ఆగిపోతున్నాయని విపక్షాలు చేసిన ఆరోపణలలో నిజం లేదన్నారు. కొత్త ఏడాదిలో ఏ ఒక్కరికీ కూడా పింఛన్ ఆగకుండా తలుపు తట్టి రూ.2,750 ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు.

గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. నియోజకవర్గంలోని టిడిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని డాక్టర్ చదలవాడకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు వి.సింహాద్రి యాదవ్, జి.కోటేశ్వరరావు, పి.ఆంజనేయ చౌదరి,పి.సునీల్, కె. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా టిడిపి కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావటానికి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోను గుంట్ల కోటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు కడియాల వెంకటేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పూదోట సునీల్, డాక్టర్ కడియాల లలిత్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక మున్సిపల్ ఆఫీసులో పారిశుద్ధ్య కార్మికుల ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున ఘనంగా నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ దస్తగిరి షకీలా విచ్చేసి కేక్ కట్ చేసి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు కూడా కేక్ కట్ చేశారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ చదలవాడకు గజమాలతో సత్కారం

కార్మికులకు మద్దతుగా చీపుర్లు పట్టిన రాజధాని రైతులు

- రోడ్లు ఊడ్చి నిరసన
- 1111వ రోజుకు రాజధాని ఆందోళనలు

ప్రజాశక్తి - తుళ్లూరు

పని భద్రత, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న రాజధాని పారిశుధ్య కార్మికులకు రాజధాని రైతులు మద్దతు తెలిపారు. రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికుల పట్ల, అమరావతి నిర్మాణంపై వైసిపి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మహిళా రైతులు ఆదివారం చీపుర్లతో రోడ్డు ఊడ్చి నిరసన తెలిపారు. మందడం రైతు దీక్షా శిబిరం నుంచి పోలీస్ ఔట్ పోస్ట్ వరకు రోడ్డు ఊడుస్తూ 'ప్రభుత్వం, అధికారులు పారిశుధ్య కార్మికుల పట్ల కనికరం లేకుండా పనిలోకి రానక్కర లేదంటూ మాట్లాడటం దారుణ'మని మండిపడ్డారు. పారిశుధ్య కార్మికులకు అండగా ఉంటామన్నారు. రోడ్డు ఊడ్చడంతో పాటు దీక్షా శిబిరంలో మహిళా రైతులు టిఫిన్ సెంటర్ నడుపుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. అన్నం పెట్టే అన్నదాతకు బతుకు తెరువు కోసం టిఫిన్ సెంటర్ నడుపుకునే పరిస్థితిని ప్రభుత్వం కల్పించిందని మహిళలు వాపోయారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చేటప్పుడు రైతులమే.. ఇప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారులమని మాట్లాడటం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతేనని ప్రభుత్వం స్పష్టం చేసేవరకు దీక్షలు ఆపేది లేదని అన్నారు. నూతన సంవత్సరం సంధర్భంగా దీక్షా శిబిరంలో సర్వమత ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేశారు. మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా రైతులు, మహిళలు చేస్తున్న దీక్షలు ఆదివారంతో 1111వ రోజుకు చేరాయి. తుళ్లూరు, మందడం, వెలగపూడి, వెంకటపాలెం, నెక్కల్లు తదితర గ్రామాల్లో దీక్షలు కొనసాగాయి.

మందడంలో రోడ్డు ఊడ్చి పారిశుధ్య కార్మికులకు మద్దతు తెలుపుతున్న రాజధాని రైతులు, మహిళలు

విద్వేషాలు తొలగి ప్రేమ భీజాలు మొలవాలి

స్వాగత కవితా పఠనంలో పలువురు కవులకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు

నూతన సంవత్సరంలో ప్రపంచంలో విద్వేషాలు తగ్గిపోవాలని, ప్రేమ బీజాలు మొలవాలని పలువురు కవులు ఆకాంక్షించారు. గుంటూరు అమరావతి సాహితీ మిత్రులు స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన 'నూతన సంవత్సర స్వాగత కవితా పఠనం' కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన కవులు పాల్గొన్నారు. కులం, మతం, ప్రాంతం, దేశం వంటి సంకుచిత దక్పథాలతో మనుషులు తాము మనుషులమని మరిచిపోతున్నారని, కొన్ని సార్లు మృగాల కన్నా హీనంగా ప్రవర్తించటం రాబోయే కాలంలో తగ్గు ముఖం పట్టాలని కవితలు వినిపించారు. మనిషి మనుగడకు ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ కూడా రాబోయే కాలంలో చైతన్యవంతంగా కొనసాగాలని హితవు పలికారు. డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించిన కవితా పఠన కార్యక్రమాన్ని సంస్థ కన్వీనర్ పింగళి భాగ్య లక్ష్మి నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ సూర్యదేవర రవికుమార్ మాట్లాడుతూ సామాజిక చైతన్య కవిత్వం విరివిగా రాయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బలభద్రపాత్రుని ఉదయ శంకర్, షేక్ కాసింబీ, మేళ్లచెరువు మాధవి, లంకా మాధవి, వి.వి.రావు, సౌపాటి ప్రభాకర్, ఈవూరు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సుధా మైధిలి కవితకు ప్రథమ బహుమతి, ఈవూరు వెంకట రెడ్డి కవితకు ద్వితీయ బహుమతి, షేక్ కాసింబీ కవితకు తృతీయ బహుమతి లభించాయి. ముగ్గురు కవుల్ని సంస్థ సభ్యులు సన్మానించారు. 'ఈ మాసం కవి' గా ఎన్ఆర్ తపస్వి పాల్గొన్నారు.

కవుల్ని సన్మానిస్తున్న రావి రంగారావు తదితరులు

సిపిఎం అభిమాని బాబురావు మృతి

ప్రజాశక్తి- మంగళగిరి

పట్నంలోని రత్నాల చెరువు సుందరయ్య నగర్ చెందిన సిపిఎం అభిమాని కాకి బాబురావు (68) ఆదివారం మృతి చెందారు. బాబురావుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాబురావు గతంలో సిపిఎం సభ్యుడిగా పనిచేసి పార్టీ అబివృద్ధి కృషి చేశారు. బాబురావు మృతికి సిపిఎం పట్టణ నాయకులు మున్నంగి చలపతిరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈ కాటమరాజు సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాజీ కౌన్సిలర్ టిడిపి నాయకులు కారంపూడి అంకమ్మరావు బాబురావు మృతి పట్ల సంతాపం తెలిపారు.

కె.బాబురావు(ఫైల్)

నేడు ముక్కోటి ఏకాదశి ఉత్సవం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం తెల్లవారుజాము నుండి ముక్కోటి ఏకాదశి ఉత్సవం జరుగుతుందని ఆలయ ఈ ఓ రామకోటి రెడ్డి తెలిపారు. ఆలయ ఉత్తర ద్వార దర్శనం కూడా జరుగుతుందని తెలిపారు. శంకు తీర్థం తీసుకునేందుకు క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యాత్రికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లుగా ఆలయ అధికారులు తెలిపారు. డిఎస్‌పి రాంబాబు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు భారీగా ఏర్పాటు చేశారు.

ఎస్ఎఫ్ఐ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 2023 క్యాలండర్‌ను ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై, సమాజానికి బాధ్యతగల నాయకుల్ని అందించటంలో ఎస్ఎఫ్ఐ ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బాలాజీ, ఎం.కిరణ్, నగర అధ్యక్షుడు రూపస్, జెవివి నాయకులు ప్రసాద్, వెంకటేశ్వరరావు, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేత

అన్నదానం నిర్వహిస్తున్న రావి సురేష్ బాబు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండల పరిధిలోని ఆత్మకూరు ముక్తినాథ్ ఆశ్రమంలోని వృద్ధులకు నూతన సంవత్సర సంధర్భంగా దేవినేని ఆర్మీ లయన్ ఇంజనీర్ రావి సురేష్ బాబు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రావి సురేష్ బాబు మాట్లాడుతూ ప్రజాసేవ ఎంతో సంతృప్తి ఇస్తుందని తెలిపారు. ఎంతో మంది విద్యార్థులకు, వృద్ధులకు, ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు. మెడికల్ క్యాంపులు,మెడికల్, పబ్లిక్ సర్వీసెస్, కెరియర్ కాన్సెలింగ్ ,ప్లేసెమెంట్స్,మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యు. నాగేశ్వరరావు,జాన్సన్, కోటేశ్వరరావు, రావి రాజేష్, సిహెచ్. దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మిస్తే నేరుగా టిడ్కో ఇళ్లకు దారి

ప్రజాశక్తి- మంగళగిరి

గౌతమ్ బుద్ధ రోడ్డు నుండి బిఎండబ్ల్యూ షోరూం పక్కన ఉన్న డ్రైనేజీ పై చిన్న కల్వర్టు నిర్మిస్తే నేరుగా టిడ్కో గృహ సముదాయంలోకి వెళ్లోచ్చని టిడ్కో గృహ సముదాయ నివాసులు వాపోతున్నారు. ప్రస్తుతం గృహలకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని, ఈ కల్వర్టు నిర్మిస్తే ఎటువంటి ఇబ్బంది లేకుండా నేరుగా ఇళ్లకు వెళ్లొచ్చని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం1728 ఇల్లు నిర్మించగా దాదపుగా అందరూ నివాసం ఉంటున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

కేలండర్,డైరీలను ఆవిష్కరిస్తున్న శివసాంబిరెడ్డి తదితరులు

మన రైతు వాణి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలి

ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన మన రైతువాణి 2023 కేలండర్‌ను నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆవిష్కరించారు. స్థానిక ఐతానగర్ సాయిబాబా గుడివద్ద రైతు సంఘం నాయకులు ఈదర పూర్ణచంద్, పలువురు రైతలతో కలిసి సాంబిరెడ్డి కేలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలోనైనా రైతులకు మేలు చేసే నిర్ణయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలన్న ఆకాంక్షించారు. రైతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వెలగపూడి శ్రీహర్ష, అన్నాబత్తుని శ్రీనివాసరావు, అంచా సత్యనారాయణప్రసాద్, శవనం సాంబిరెడ్డి, ఇ.పిచ్చయ్య చౌదరి, ఇ. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి- మేడికొండూరు

బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆసరాగా ప్రభుత్వం ఎన్నో పథకాలు అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మండలంలోని వరగాని గ్రామంలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా గ్రామ సచివాలయాల పరిధిలోని వాలంటీర్ల వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. పింఛన్లు మూడో దఫా పెంపులో భాగంగా నెల నుండి పెరిగిన రూ 2,750 పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వరగాని గ్రామ సర్పంచ్ సాని కొమ్ము ఎలా మందారెడ్డి, యు పి ఆర్ డి పి రవికుమార్, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పలువురు జిల్లా అధికారులు శుభాకాంక్షలు

కలెక్టర్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జెసి, తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు

నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి దంపతులకు, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, డిఆర్‌ఒ కె.చంద్రశేఖర్‌రావు, ఆర్‌డిఒ ప్రభాకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఒ పూర్ణచంద్రరావు పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో డిప్యూటీ కలెక్టర్లు లలితా, భాస్కర నాయుడు, జెడ్పి సిఇఒ శ్రీనివాసరెడ్డి, డిఆర్‌డిఎ, హౌసింగ్, వ్యవసాయ, విద్యాశాఖ, తదితర శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

కమిషనర్ ఛాంబర్‌లో నూతన సంవత్సర వేడుకలు

కేక్ కట్ చేస్తున్న కమిషనర్, అడిషనల్ కమిషనర్ తదితరులు

ప్రజాశక్తి - గుంటూరు

నూతన సంవత్సరం సందర్భంగా జిఎంసి కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ కీర్తి చేకూరి, అదనపు కమిషనర్ పెద్ది రోజా, సిటీ ప్లానర్ మూర్తి, వివిధ విభాగాల అధికారులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

డాక్టరేట్ అందుకున్న అధ్యాపకురాలు గాయత్రిని అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

ఎన్నారై అధ్యాపకురాలు గాయత్రికి డాక్టరేట్

ప్రజాశక్తి -మేడికొండూరు

మండలంలోని సత్తెనపల్లి రోడ్‌లోని విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్‌ఆర్‌ఐ ఐటి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు గాయత్రి మెకానికల్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారని ఎన్నారై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కోట శ్రీనివాసు తెలిపారు. డెవలప్మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ చికెన్ ఫెదర్ అండ్ సాడస్ట్ రైన్ ఫోర్స్ హైబ్రిడ్ కాంపోజిట్స్ అనే అంశం మీద చేసిన పరిశోధనకు గాను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ద్వారా అందుకున్నట్లు తెలిపారు. గాయత్రికి ఆర్‌విఆర్ జెసి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి జి.శ్రీనివాసు గైడ్‌గా వ్యవహరించినట్లు తెలిపారు. గాయంత్రి తన పరిశోధనలో భాగంగా 6 పేపర్లు ప్రముఖ ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో ప్రచురించారని తెలిపారు. గాయంత్రిని కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల మెకానికల్ విభాగాధిపతి పి.రవికుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీహరి, వివిధ విభాగాల అధిపతులు చంద్రమౌళి, రాము, కోటేశ్వరరావు, ఏవో సీతారామయ్య, మెకానికల్ విభాగ అధ్యాపకులు బి.ప్రదీప్, టోనీ, సాయి, సుగుణ్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కరాటే బెల్ట్ పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక లక్ష్మీనారాయణ దేవస్థానం ఎదురుగా ఉన్న కరాటే అండ్ ఫిట్నెస్ సెంటర్లో జిల్లాస్థాయి కరాటే బెల్ట్ పోటీలు ఆదివారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో మంగళగిరి సీనియర్ కరాటే మాస్టర్ జీవీ నరసయ్య, జూడో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాంబాబు, జపాన్ కరాటే ఆర్గనైజింగ్ సెక్రటరీ గంజి కులశేఖర్ పాల్గొన్నారు.

పథకాలపై నిరంతర నిఘా

- ఆదాయానికి గండికొట్టే చర్యలపై విస్తృత తనిఖీలు
- వైద్యసేవలు, సంక్షేమంపై దృష్టి
- ప్రజాశక్తితో విజిలెన్స్ ఎస్‌పి మాధవరెడ్డి

ఇంటర్వ్యూ

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై నిరంతర నిఘా ఉంటుందని గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎన్.వి.మాధవరెడ్డి చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖల్లోని అవకతవకలపై విచారణలు జరిపి, ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదికలు పంపటంతో పాటు, నిత్యావసర సరుకుల పంపిణీ, అక్రమ రవాణా, అధిక ధరలు, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి, ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్ను ఎగవేత తదితర అంశాలపై దృష్టి సారించామని తెలిపారు. గతేడాది చేపట్టిన పలు అంశాలను ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

రేషన్ బియ్యం అక్రమాలపై చర్యలు?

రేషన్ డీలర్లు, వాహనదారుల వద్ద సబ్సిడీ బియ్యం అక్రమంగా కొని, నిల్వచేసి అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారి నుండి రూ.1.78 కోట్ల విలువైన 4961.41 క్వింటాళ్ల బియ్యాన్ని, 36 వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. 6ఎ కేసులు 56, క్రిమినల్ కేసులు 30 నమోదు చేశాం. రేషన్ షాపుల్లో అక్రమాలకూ పాల్పడుతున్న డీలర్ల నుండి 1219 క్వింటాళ్ల బియ్యం, 15.63 క్వింటాళ్ల పంచదారను, 8.55 క్వింటాళ్ల కందిపప్పును స్వాధీనం చేసుకున్నాం. మొత్తం 47 మందిపై నిత్యావసరవస్తుల చట్టం (6ఏ), 20 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం.

వంట నూనెల అక్రమ రవాణా, అధిక ధరలపై తీసుకున్న చర్యలు?

వంట నూనెలను అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించినందుకు, అక్రమ వ్యాపారానికి పాల్పడినందులకు రూ.3.55 కోట్ల విలువగల 278 మెట్రిక్ టన్నుల నూనెలు స్వాధీన చేసుకున్నాం. 9 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేశాం.

తూకాల్లో తేడాలను ఎలా గుర్తించారు?

వివిధ రకాల నిత్యావసర సరుకుల అమ్మకాల్లో తక్కువ తూకం (50 గ్రాముల నుండి 400 గ్రాముల వరకు) ద్వారా వినియోగదారులను మోసగిస్తున్న వ్యాపారులపై లీగల్ మెట్రాలజీ చట్టం కింద 397 కేసులు నమోదు చేశాం. ఇప్పటివరకు రూ.13.73 లక్షల అపరాధ రుసుం వసూలు చేశాం.

గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగంపై కేసులు?

గృహ అవసరాలకు వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను హోటళ్లు, రెస్టారెంట్లలో వాణిజ్య అవసరాల కోసం వినియోగిస్తున్న వారి నుండి 247 ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశాం.

ఎన్‌వి.మాధవరెడ్డి

ఎరువుల అక్రమ విక్రయాలపై తనిఖీలు

ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వ్యాపారంలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై 29 కేసులు నమోదు చేశాం. వీరిలో ఏడుగురిపై క్రిమినల్ కేసులున్నాయి. 74.307 మెట్రిక్ టన్నుల ఎరువులు, 33 లీటర్ల పురుగు మందులు, 203.6 కిలోల విత్తనాలు మొత్తం రూ.14.06 లక్షల విలువగల సరుకును స్వాధీనం చేసుకున్నాం.

సంక్షేమ పథకాలపై చేపట్టిన పరిశీలన?

పేదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం (జగనన్న గోరుముద్ద), రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడి సెంటర్లు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. సంక్షేమ పథకాలు మరింత మెరుగుగా అమలు జరిగేలా లోపాలు తెలియజేస్తూ సూచనలు చేస్తూ నివేదికలు ఇస్తున్నాం. ప్రభుత్వ శాఖల్లో నిధుల దుర్వినియోగానికి సంబంధించి పలు విజిలెన్స్ నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తున్నాం.